క్లుప్తంగా

వివాహానికి జెడ్పీటీసీ ఆర్థికసాయం

శింగనమల: మండలంలోని తరిమెలకు చెందిన చిత్రచేడు నరసింహులు, లక్ష్మీదేవి కుమారుడు నాగర్జున వివాహానికి జెడ్పీటీసీ సభ్యురాలు కంచి రెడ్డి సుధ ఆర్థిక సాయం చేశారు. మంగళవారం గ్రామంలో నరసింహులు రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. కసాపురం ఎస్‌ఐ గోపాలుడు వివరాల మేరకు..కర్నూలు జిల్లా, చిప్పగిరి మండలం, దౌల్తాపురం గ్రామానికి చెందిన జగన్నాథ్(40) సోమవారం సాయంత్రం బైక్‌పై గుంతకల్లుకు వస్తూ మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత వైద్యుల సూచనల మేరకు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఉదయం అక్కడే మృతి చెందాడు.

ఘనంగా మన్యసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య హోమాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు ప్రజా సంక్షేమయాత్ర

తాడిపత్రి టౌన్:ప్రజా సంక్షేమయాత్రలో భాగంగా బుధవారం బ్రాహ్మణపల్లి, ఇగుదూరు, గంగాదేవిపల్లిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాదయాత్ర చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరాయి.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన



బ్యాగుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్,

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్‌పాయింట్‌లో మంగళవారం ఎంపీడీఓ విజయభాస్కర్, వైకేపీ అనిమేటర్స్ కిట్ల నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ చంద్రనాయక్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4,681 మంది విద్యార్థులున్నారన్నారు. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు.

యాడికి పీహెచ్‌సీ వైద్యుడిగా శ్రీరామ్‌కుమార్



యాడికి: మండల పీహెచ్‌సీ వైద్యుడిగా శ్రీరామ్ కుమార్ మంగళవా రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వైద్యుడిగా విధులు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్ ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరామ్‌కుమార్‌ను జిల్లా వైద్యాధికారులు యాడికి పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన వైద్యుడు శ్రీరామ్‌కుమార్ మాట్లాడుతూ అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

కేసు నమోదు

గుత్తి రూరల్: బేతాపల్లి గ్రామంలో తాగునీటి విషయంపై ఘర్షణ జరిగి అల్లావలి అనే వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. బేతాపల్లిలో సోమవారం రాత్రి తాగునీటి విషయంపై ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి అల్లావలిపై ముగ్గురు దాడి చేసి గాయపరిచారు. దాడిలో అల్లావలి కింద పడి తీవ్రంగా పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వెంకటనారాయణతో పాటు మరో ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సునీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దామోదరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రి మండలంలో మూడో విడత ప్రజా సంక్షేమయాత్రలో భాగంగా మంగళవారం తాడిపత్రి మండలం అయ్యవారిపల్లిలో ప్రారంభమైన పాదయాత్ర అయ్యవారిపల్లితండా, వెంకటాంపల్లి, తిమ్మేపల్లి, బ్రాహ్మణపల్లి వరకు సాగింది. ఎమ్మెల్యే పాదయాత్రకు పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీబావం తెలిపారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే పథకాలు వర్తించేవన్నారు. తమ ప్రభుత్వంలో కులమత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ కేవలం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పథకాలు వర్తించేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నాయకులు, వారి కార్యకర్తలకే పథకాలు వర్తించేవన్నారు. ప్రస్తుతం ఏగ్రామానికి వెళ్లినా ప్రజలు జగనన్న పాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య వచ్చినా తాను తప్పక తీరుస్తానని ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ జేసీ సోదరులు వారి స్వలాభం, ఆధిపత్యం కోసం గ్రామాల్లో వర్గ కక్షలు రేపి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో వర్గాలు ఏర్పడేలా చేశారన్నారు. వారి ఎత్తుగడలను గుర్తించిన ప్రజలు గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. ప్రజలు మళ్లీ జగనన్నను గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, జెడ్పీటీసీ కురుబ రమణమ్మ, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, శేషా, పరమేశ్, నాగార్జున రెడ్డి, అప్పిరెడ్డి, శివారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



శింగవరంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రతి సంక్షేమం గడప గడపకూ వెళ్లిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం యల్లనూరు మండలం శింగవరంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు అండ్‌కో ప్రజల సొమ్మును దోచుకో–దాచుకో అనే నినాదంతో ముందుకు సాగిందన్నారు. పేదల ఖాతాల్లోకి నేరుగా డబ్బు వేస్తున్న జగనన్న లాంటి ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. జగనన్న మంచితనాన్ని అందరూ గుర్తించాలన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో దోమలు ఎక్కువగా ఉన్నాయని, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన విత్తన వేరుశనగ



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రాయితీపై రైతులకు అందించే విత్తన వేరుశనగ కాయలు గ్రామాల్లోని ఆర్‌బీకేలకు చేరాయి. ఒక్కో ఆర్‌బీకేకి 100 నుంచి 200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. గ్రామాల్లోని ఆర్‌బీకేలకు చేరిన విత్తన వేరుశనగ కాయలను సచివాలయ వీఏఏలు స్వాధీనం చేసుకుని గొడౌన్లలో నిల్వ ఉంచారు. మంగళవారం మొదటి విడతగా తురకపల్లి రైతు భరోసా కేంద్రానికి వచ్చిన 100 క్వింటాళ్ల వేరుశనగ కాయల నాణ్యతను వీఏఏ మానసతో కలిసి రైతులు పరిశీలించారు. విత్తనాలు మంచి జౌటన్ ఉన్నాయని రైతులు హనుమంతురెడ్డి, నారాయణ, శివారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

గార్లదిన్నె: ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు మండలానికి కె6 రకం 2,500 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించినట్లు ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం గార్లదిన్నె ఆర్బీకేకు విత్తన వేరుశనగ చేరాయి. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇప్పటికే మండలవ్యాప్తంగా విత్తన వేరుశనగ కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించామన్నారు.

శ్రీగంధం సాగు లాభదాయకం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: శ్రీ గంధం సాగు లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ(బెంగళూరు) ఆధ్వర్యంలో రైతులకు శ్రీ గంధం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుందర్ రాజ్ శ్రీగంధం సాగు పద్ధతులు, మార్కెటింగ్ గురించి తెలియజేశారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి శ్రీగంధం సాగు, మార్కెటింగ్ లైసెన్స్‌లపై వివరించారు. ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త గిరిబాబు, కేవీకే సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన, ముత్యాల రావు, వేణుమాధవ్, నవీన్ సాయి, డిస్ట్రిక్ట్ అడ్వయిజరీ బోర్డు మెంబర్ ఆలమూరు సుబ్బారెడ్డి, శింగనమల విజయభాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: మద్యం సేవించేందుకు భార్య డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ధరణీబాబు వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన గంగరాజు(36) పెయింటర్ పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతడు మద్యం కోసం డబ్బు ఇవ్వాలని మంగళవారం ఉదయం భార్యతో గొడవపడ్డాడు. భార్య డబ్బు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యం ఇంటికి తెచ్చుకుని అందులో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన భార్య అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించింది. తర్వాత అనంతపురం తరలించగా అక్కడే మృతి చెందాడు. అతడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నష్ట పరిహారం అందించండి

పెద్దవడుగూరు : అకాల వర్షాలతో తీవ్ర నష్టాల పాలైన రైతులకు నష్ట పరిహారం అందించాలని రైతు సంఘం మండల నాయకులు, సీపీఎంనేత దస్తగిరి కోరారు. మంగళవారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు రామగోవిండ్, నగేష్, రామాంజినేయులు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించండి

పామిడి: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని శశికళ కోరారు. గుత్తి బీసీసీరోడ్డులో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఈఓఆర్డీ ఆధ్వర్యంలో జేసీబీతో మంగళవారం తొలగింపజేశారు. ఈసందర్భంగా కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగింపజేయడంతో మురుగునీరు ముందుకు సాగింది. ప్రజా ఆరోగ్య నిమిత్తం కాలువలపై అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఈఓఆర్డీ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మేస్త్రీ నాగరాజు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్, అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన బాలబాలికల ఓపెన్ చెస్ టోర్నీలో మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించిన అండర్–14 విభాగంలో హిమోష అనే విద్యార్థి 9 రౌండ్లకు కాను 5 రౌండ్లలో విజయ సాధించి గుంతకల్లు బెస్ట్ ప్లేయర్ ట్రోఫీతో పాటు మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. అండర్–11 విభాగంలో జాన్వీ అత్యధిక పాయింట్స్ సాధించినట్లు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు మాంటిస్సోరీ స్కూల్ అధినేత నాగార్జున, కోచ్ అనిల్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

కాలుష్య నివారణకు కృషి చేద్దాం

గుంతకల్లు రూరల్: కాలుష్య నివారణకు కృషి చేద్దామని తహసీల్దార్ రాము పేర్కొన్నారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీ ఆర్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమానికి తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ కాలుష్యం కారణంగా మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. ఫారెస్ట్ సర్వీసెస్ అధికారి దీప, గ్రోవిత్ ఫ్లో టీమ్ సభ్యురాలు జింకల ప్రణతి, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, భారత రాజ్యాంగ అవగాహన వేదిక మహిళా విభాగ అధ్యక్షురాలు జింకల సరస్వతి, కన్వీనర్ చంద్రశేఖర్, గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ యాజమాన్య నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- విద్యుత్ ప్రమాద బాధితుడికి వైద్య ఖర్చులు అందజేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి టౌన్: స్థానిక భోగసముద్రం సమీపంలోని సుగ్నా స్పాంచ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి పవన్ కళ్యాణ్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. గన్నేవారిపల్లి కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ సమీపంలో పడేసిన ఫ్యాక్టరీ వ్యర్థాల కుప్ప పెరిగి పైనున్న విద్యుత్ తీగలకు చేరువయ్యాయని వివరించారు. ఈ క్రమంలో సోమవారం వ్యర్థాలపై ఆడుకుంటున్న పవన్‌కళ్యాణ్‌కు విద్యుత్ తీగలు తగిలి శరీరం మొత్తం కాలిపోయిందన్నారు. విషమ పరిస్థితిలో కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వైద్య ఖర్చులు మొత్తం పరిశ్రమ యాజమాన్యామే భరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పరిశ్రమ ఎదుట గ్రామ ప్రజలతో కలసి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామశేఖర్, డీవీ కుమార్, గురుప్రసాద రెడ్డి, రాజగోపాల్, తిరుపాల్, శివ పాల్గొన్నారు.

తాడిపత్రి కానిస్టేబుళ్లకు ఎస్పీ ప్రశంస



ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ భాస్కర్, చిత్రంలో డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి అర్బన్: విధి నిర్వహణ ఉత్తమ ప్రతిభను కనబరచిన తాడిపత్రికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కే. శ్రీనివాసరావు అభినందించారు. పట్టణంలోని సంజీవనగర్ రెండో రోడ్డులో ఇటీవల వారం కిందట విశ్రాంత తహసీల్దార్ శ్రీనివాసరావు ఇంటిలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీలో రూ.5 లక్షల విలువ చేసే బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల తాడిపత్రికి చెందిన కానిస్టేబుళ్లు భాస్కర్, రిజ్వాన్‌వలి చాకచక్యంగా కేసును ఛేదించి చోరీ సొత్తు రకవరీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకుగాను మంగళవారం జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు తన కార్యాలయానికి పిలిపించుకుని అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చుక్కలూరు పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య సూచించారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ లావణ్య వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురష్కరించుకుని వైద్య,ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి మస్రోసత్రం మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు పేర్కొన్నారు.

యాడికి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాడికి పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారులు శ్రీనివాసులు రెడ్డి, శ్రీరామ్‌కుమార్ సిబ్బందితో ర్యాలీతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు డెంగీ లక్షణాలు, వ్యాధి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జుబేదా, ఎంపీహెచ్‌ఈఓలు శ్రీనివాసులు, ఈరన్న, పీహెచ్‌ఎన్ వెంకటలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని మంగళవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ముందుగా పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మిస్వాతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో దోమలు ఎక్కువై డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, శివానంద, నాగరాజు, ఆనంద్, కీర్తి, జ్యోతి, జయంతి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండల కేంద్రంలో మంగళవారం ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వారానికోసారి డ్రై డే నిర్వహించాలన్నారు. డెంగీ నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకుముందు బీసీసీరోడ్డు నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఎంపీహెచ్‌ఈఓ శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం

పెద్దవడుగూరు: అవులాంపల్లిలో మంగళవారం రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. న్యూ కేటగిరీ విభాగంలో 14 జతల వృషభాలు పోటీల్లో పాల్గొనగా 9 జతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గోర్లగుట్ట, ఎద్దుల రవీంద్రారెడ్డి వృషభాలు ప్రథమ బహుమతి రూ.80 వేలు దక్కించుకున్నాయి. బోరెడ్డి కేశవరెడ్డి(పెద్దకొట్టాల, నంద్యాల జిల్లా) వృషభాలు ద్వితీయ బహుమతి రూ.60 వేలు, శివకోటి యాదవ్(పీఆర్ పల్లె), రాకెట్ల భీమలింగప్ప(పెచ్చులపాడు) వృషభాలు తృతీయ బహుమతి రూ.50 వేలు, నంద్యాల జిల్లా చిన్నకానాల గుండం చిన్నరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.40 వేలు, తోట తిరుపాల్‌రెడ్డి(మేడిమాకులపల్లి) వృషభాలు ఐదో బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి వద్ద మంగళవారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..గుంతకల్లుకు చెందిన శేఖర్ బైక్‌లో గుత్తికి బయలు దేరాడు. గొల్లలదొడ్డి వద్ద అదుపు తప్పి బైక్‌పై నుంచ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం «గడప గడపకూ మన ప్రభుత్వం» కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

గుంతకల్లు రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకత, పుస్తక పఠనాసక్తిని పెంపొందించడంలో భాగంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి హేమలత మంగళవారం కోరారు. మ్యాథ్స్, చిత్రలేఖనం, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, క్యారమ్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కట్టెలతో దాడి

యాడికి: పొలం విషయంలో ఓ వ్యక్తిపై కట్టెలతో దాడి చేసిన ఘటన మంగళవారం నిట్టూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, దశరథరాములు అన్నదమ్ములు. ఈశ్వరయ్య తన తమ్ముడు దశరథరామునికి చెందిన పొలం సర్వే నంబర్ 682–బిలో 2–19 ఎకరాలను 2006లో కొని రిజిష్టర్ చేసుకున్నాడు. తన పొలాన్ని తన చిన్నాన్న దశరథరాముడు ఆక్రమించుకోవడంతో తన పాసుపుస్తకంలో ఉన్న 2.19 ఎకరాల విస్తీర్ణం లేదనిరామాంజనేయులు(ఈశ్వరయ్య కుమారుడు) తన చిన్నాన్నతో అనేక సార్లు గొడవపడ్డారు. మంగళవారం రామాంజనేయులు పొలం దున్నుతుండగా దశరథరాముడు తన కొడుకుతో కలిసి వచ్చి ఎందుకు దున్నుతున్నావని గొడవపడి కట్టెతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కట్టెతో దాడికి పాల్పడిన దశరథరాముడితోపాటు ఆయన కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్‌ఐకు సన్మానం

పెద్దవడుగూరు : ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి ఇటీవల నార్పలకు బదిలీకావడంతో మంగళవారం స్థానికులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రజలు ఎస్‌ఐను పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ సేవలను కొనియాడారు.

కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

గుత్తి: సీబీఎస్‌ఈ పది, 12వ తరగతుల్లో వంద శాతం ఉత్తీర్ణతతో గుత్తిలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసన్ మంగళవారం తెలిపారు. టెన్త్‌లో 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఇందులో భవ్యరాజ్ 91 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచాడు. భువిక జెస్సీ(87.4 శాతం), షేక్ ఫైజా అంజుమ్(82.6 శాతం) సాధించారు. 12వ తరగతిలో వర్షాశ్రీ 80.2 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది. షేక్ అఫ్రీన్ 79.2 శాతం, దయమణి 78.6 శాతం మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.